# అక్క

ద్వివేదుల విశాలాక్షి



ఎంతో అందంగా ఉండేది అక్క-

అప్పుడే రేకులు విచ్చుకొంటున్న పువ్వులా - ఎండా వానల కలయికతో ఆకాశాన విరిసిన హరివిల్లులా - కడలి తరగలపై వెల్లివిరిసిన వెన్నెల కాంతిలా. గులాబిపూరేకుల్ని పాలమీగడతో కలిపి మర్దించి, పురిషెడు బంగారుసీటితో పదునుచేసి ఆ ముద్దతోచేసిన బొమ్మలా ఉండేది అక్క శరీరవర్ణం. అందాలు చిందే సొగకళ్ళు-తీర్చిదిద్దినట్లుండే కను ముక్కు-తీరు-పిరుదులనుతాకే నిడుపాటి మెత్తనిజుట్టు - ఒక్కమాటలో చెప్పాలంటే నేర్పరియైన పుష్పలావిక అతి శ్రద్ధగా అల్లిన కదంబమాలలా ఉండేది అక్క.

తను అంత అందంగా ఉండేదికాబట్టే బావ కావాలని పట్టుపట్టి మరీ అక్కని పెళ్ళి చేసుకున్నాడు. అయిదారువేల కట్నాలతో వచ్చే అమ్మాయిల్ని కాదనీ, చిన్ననాటినుండీ అనుకొంటున్న మేనరికాన్ని కాలదన్ని, కనిపెంచిన తల్లి మనసు కష్టపెట్టడానికైనా సిద్ధపడి, ఎటు

వంటి కట్న కానుకలు, లాంఛనాలు ప్రసక్తిలేకుండా అక్కని చేసుకోడానికి ముందుకు వచ్చేడు అంటే అతడికి అక్క పట్లగల ఇష్టం, ఆకర్షణఎంతగా ఉండేవో తెలుసుకోవచ్చు.

బావపేరు రాజారావు. అక్క పెళ్ళికి పూర్వం అతడు బావకాడు - ఉట్టి రాజారావే. పెళ్ళితో ఏర్పడిన బాంధవ్యం అది. రాజారావు కాలేజీలో లెక్చరర్. మనిషి మరీ అందగాడని చెప్పిందికి లేకపోయినా అనాకారిమాత్రం కాడు. కొద్దిగా భూవసతి, స్వంతఇల్లు ఉంది. తల్లి తప్పితే, వెనకాముందూ ఏ విధమైన బాదరబందీలేని సంసారం. అటువంటి యువకుడు తనకు తానుగావచ్చి "దమ్మిడీ కట్నం లేకుండా మీ మేనగోడల్ని చేసుకోవాలనుకొంటున్నాను, మీరు అంగీకరిస్తే" అని అర్థిస్తే, మామయ్యేకాదు ఇంట్లో ఎవ్వరం కూడా నమ్మలేకపోయేము ఆ మాటని.

పండులాంటిఉద్యోగం ఇంతో అంతో వెనుక ఆస్తిఉన్న అబ్బాయి తనంతట తను వచ్చి కట్నంలేకుండా చేసుకొంటాననడమేమిటి ? ఇందులో ఏదో మోసం ఉండి ఉంటుంది. ఈ రోజుల్లో ఎవర్నీ ఏదానికీ ఉన్నపాటునే నమ్మకూడదు. ఎవరి బుర్రలో ఏం ఆలోచనలున్నాయో- అంటూ అనుమానపడ్డాడు మామయ్య. అతడు తిరిగి తిరిగి అదే ప్రస్తావన తేవడంతోనూ అతడు ఆమాట అంటున్న తీరులో నిలకడ, నిర్ణయం కలసి ధ్వనిస్తున్నకారణంగానూ చివరికి మామయ్యకి నమ్మక తప్పిందికాదు.

అప్పచెల్లెలు పోయేక తల్లీ తండ్రీలేని అనాధలనిజాలితలచి అక్కనూ నన్నూ ఇంటికి తెచ్చి పెంచేదేకాని మామయ్యది ఏమంత చెప్పుకోవలసిన ఆర్థికస్థితి కాదు. తల్లీ, పెళ్ళాం, తనూ కాక నలుగురు తన పిల్లలు, ఇద్దరు చెల్లెలి పిల్లలు - ఇంత మందికి రెండుపూటల కడుపులు నింపడమే కష్టంగా ఉంటే ఇంక కట్నకానుకలిచ్చి పెళ్ళిచెయ్యడం అన్నమాటకి అవకాశమే లేదు - అలాగని ఈడొచ్చిన ఆడపిల్లలికి పెళ్ళీపేరంటం చెయ్యకుండా ఎంతకాలం ఇంటపెట్టుకొని పోషిస్తాడు ? ఇటువంటి స్థితిలో మామయ్య కొట్టుమిట్టాడుతున్నసమయంలోవెదుకబోయిన తీగె కాలికితగిలింది-అన్నట్లు స్వయంగా పిల్లని అర్థిస్తూ ఇంటికి వచ్చేడు బావ.

ఈ వార్త విన్నవారంతా అక్క అదృష్టవంతురాలన్నారు. తల్లిలేని ఆపిల్ల పట్ల దేవుడున్నాడు.అందుకే అంతమంచి సంబంధం వచ్చిందని మెచ్చుకొన్నారు. అక్కపెళ్ళి అయేక ఒకటి రెండుసార్లు వారింట ఉండివచ్చిన నాకూ అలాగే అనిపించింది. అక్కంటే బావకి వల్లమాలిన అభిమాన, ప్రేమ, ఆరాధనా-కాలు కింద పెడితే కందిపోతుంది అన్నట్లు చూసుకొనేవాడు. అక్కనోట ఏదైనా మాటరావడమేతడవుగా అందుకే తానున్నట్లు, దానిని నెరవేర్చడానికి ఉరుకులు పరుగులుగా తయారయేవాడు.


అక్క అత్తగారుకూడా స్వతహాగా మనిషి మంచిది. కొడుకు తనమాటకాదని పై పిల్లని చేసుకొన్నాడు అని మొదట్లో కొంచెం మనసు కష్టపెట్టుకొన్నా ఆ కోపాన్ని కోడలిమీద ఏమాత్రం చూపేది కాదు. ఒక్కగానొక్క కొడుకు. తను కోరి చేసుకొన్న పిల్లని ఈసడిస్తే ఏం బాధపడ్తాడోఅన్నట్లు అక్కని ఆదరంతో అభిమానంగా చూసేది.

పెళ్ళితో అక్కచదువుఆగిపోయింది. నా చదువు హైస్కూలు గట్టుదాటి కాలేజీలో ప్రవేశించడానికి కర్ణుడి చావుకి కారణాలు అన్నట్లు ఎన్నో పరిస్థితులు తోడ్పడ్డాయి. మొదటిది - బావలా ఉద్యోగం, ఆస్తిపాస్తులు ఉన్నవాడు కాకపోయినా ఆ పూటకి తిండిపెట్టగల తాహతుఉన్నవాడెవడూ కట్నంలేకుండా మీ చిన్న మేనగోడల్ని చేసుకుంటానని మామయ్య ఇంటిగుమ్మం ముందుకు రాకపోవడం - తెలివిగా చదువుకొంటూ ప్రతిఏటా మంచి మార్కులతో పరీక్షలు పాసుకావడం. స్కాలర్‌షిప్ రావడంవల్ల నా చదువుకోసం మామయ్య తన జేబులోంచి పైస ఖర్చు చెయ్యవలసిన అవసరం కలగకపోవడం ఇవన్నీ ఆగికుండా బండి నడవడానికి కారణాలు అయేయి. అంతేకాక ఈరోజుల్లో ఆడపిల్లలు కొందరు చదువుకొని ఉద్యోగాలు చేస్తూ ఆర్థికంగా తనవారికి సహాయపడ్తున్నారు అన్న విషయం అత్తయ్యకి మామయ్యకి తెలియంది కాదు. అత్తయ్య కన్నసంతానంలో ఆడపిల్లలు పెద్దవాళ్లు- మొగపిల్లలు చిన్నవాళ్ళు. అమ్మాయిలు శుద్ధ మొద్దావతారాలు — మామయ్య నడ్డివంగందే వారికి పెళ్ళిళ్ళయే మార్గంలేదు. మనమేం పెట్టాలా పొయ్యాలా. పిల్ల తెలివిగా చదువుకొంటున్నది చదువుకోనీ అనుకొన్నారు ఆ దంపతులు.

నా చదువు విషయంలో మామయ్య అత్తయ్యల అభిప్రాయాలు ఏమైనప్పటికీ అప్పటి పరిస్థితుల్లో కష్టపడి చదివి ఒక డిగ్రీ సంపాదించుకోడం దానితో చిన్నదో పెద్దదో ఒక నౌకరీ చూసుకొని, నా కాళ్ళపై నేను నిలవగలిగే స్థితిని సంపాదించుకోడం ఎంతయినా అవసరంగా తోచింది. హైస్కూలు పరిధి దాటినా చదువు ముందుకిపోడానికి ముఖ్యకారణం అది.

పి. యు. సి. లో ఉండగా అక్కకి పాపపుట్టింది. రాజేశ్వరి అని అమ్మ పేరు పెట్టేరు. నేను బియ్యే మొదటిసంవత్సరం పూర్తిచేసేసరికి కుముదం పుట్టింది. రాజేశ్వరి మూడుమూర్తులా అక్కలా వుండేది. ఎన్నిసార్లు చూసినా కుముదం ఎవరిపోలికో నాకు అంతుపట్టేది కాదు. ఆ పిల్లలో అక్కరూపుగాని బావ పోలికలుకాని స్పష్టంగా కన్పించేవికావు.

రెండవసారి పురుడుపోసుకొన్నప్పుడు




ఇక పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోవాలనుకొంది అక్క. "నీ ఇష్టం" అన్నాడు బావ. అక్క అత్తగారు మాత్రం వంశోద్ధారకుడైన మగ పిల్లడు కలగలేదని ఒప్పుకోలేదు. "ఇద్దరు ఆడపిల్లల తరువాతమగపిల్లాడు పుట్టడం మా ఇంటఉన్న ఆనవాయతి. ఇప్పటి పద్ధతి ప్రకారంగానైనా ఇద్దరు లేక ముగ్గురు అంటున్నారు కదా. మూడో కానుపులో మగపిల్లాడే పుడ్తాడు. అలాకాక ఆడపిల్లపుట్టినా అప్పుడునేనేం అడ్డుమాట వెయ్యను. నీ ఇష్టం ఎలాఉంటే అలా చేద్దువుగాని. ఈసారికి నామాట విను. పెద్దదాన్ని ఎందుకు చెప్తున్నానో కాస్త ఆలోచించు" అంటూ ఆవిడ పట్టుపట్టింది.

అత్తగారి మాటకి విలువ ఇచ్చో లేక ఆసారి కానుపు కష్టం అయి ఆరోగ్యం తిన్నగా లేనందున డాక్టర్ల సలహావల్లనో అక్క తను అనుకొన్నట్లు, ఆపరేషన్ చేయించుకోలేదు.

ఈ సంఘటన జరిగిన రెండేళ్ళకి నేను బియ్యే పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న సమయంలో వచ్చింది పిడుగులాంటి వార్త. అక్క ప్రసవించి నెలలు నిండకుండా పుట్టిన బిడ్డతోపాటే ఈ లోకాన్ని వదిలి వెళ్ళి పోయిందన్న విషాదవార్త.

అంతకు పదిరోజులక్రిందట నవ్వుతూ నన్ను సాగనంపిన అక్క ఇంక కనబడ దంటే, ఈ లోకంలో లేదంటే నమ్మలేక పోయేను. అక్క చచ్చిపోయింది అన్న మాటని హరాయించుకోడానికి నామనసు విలవిల్లాడిపోయింది. అంతవరకూ ఎంతో ఆరోగ్యంగా తిరుగుతూ నాన్న లేనిలోటు కనిపించకుండా నన్నూ అక్కనీ పెంచు కొచ్చిన అమ్మ రాత్రికి రాత్రే మంచాన పడి, తెల్లవారేసరికి శవంగా మారిపోతే, అటువంటి విషయాన్ని కలలో కూడా ఊహించలేనంత చిన్నవయసులో ఉన్న నేను, అక్క ఎలా బెగిలిపోయేమో ఎంతగా దుఃఖించేమో—'ఇంక నాకు అక్కలేదు' అన్నవార్త విన్నప్పుడు అంతకు పదిరెట్లుగా కుమిలిపోయేనునేను. బాధపడ్డాను - రోదించేను.

నన్ను కడుపున కన్నది అమ్మ అయితే ప్రేమానురాగాల్ని అందించి, లాలించి, బుజ్జగించి పెంచి పెద్దచేసింది అక్క. అమ్మపోయేక నా కంటే నాలు గేళ్ళు పెద్దది అయిన అక్క నాకు తల్లి, తోడు, నేస్తం, దైవం అన్నీ తనే అయింది. అప్పటిస్థితిలో అక్కే నా పక్కన లేకపోతే బెంగతో ఒంటరి తనంతో ఎప్పుడో ఈ ప్రాణాలు వదలి పెట్టి ఉండేదాన్ని. అటువంటి అక్క ఇప్పుడు లేదు - ఈ విషాన్ని మింగడం ఎలాగ? మింగి జీవించిఉండడం ఎలాగ? రాత్రింబగళ్ళు విలపించేను అక్కని తలుచుకొని.

అందాలుచిందే పువ్వులాంటి అక్క జీవితం పూర్తిగావికసించకుండానే వాడి, రేకులురాలి నేలపాలయింది. ఆమే కావా లని ఏరికోరి చేసుకొన్న బావ బ్రతుకులో వసంతం తరలిపోయింది. అ భ మూ శుభమూ ఎరుగని చిన్నారిపాపలకి తల్లి ప్రేమ కరువయింది. తన కారణంగానే పండులాంటి కోడలి జీవితం బుగ్గిపా లయిందని ఏకధారగా ఏడుస్తున్న ముస లావిడ రోదనతో ఇరుగు పొరుగుల కళ్ళు చెమ్మగిల్లేయి. ఆ ఇంట్లో అక్కలేదన్న సత్యాన్ని, ఇంక తిరిగిరాదన్న నిజాన్ని ఆ ప్రదేశంలో అణువణువూ చాటి చెప్తుంటే...ఎలుగెత్తి చాటుతుంటే ఇంకా ఆ వార్త నిజంకాదనీ - పిచ్చిపిల్లా నా కోసం ఏడుస్తున్నావా - అంటూ అక్క ఏమూలనుంచో వచ్చి నన్ను ఓదారుస్తుం

దనీ ఎలా అనుకోడం? నన్ను నేను ఎలా ఓదార్చుకోడం?

ఎంతేసి బాధల్ని, కష్టాల్ని, ఆరాటాన్ని నివారించే మందు కాలంలో ఉంది. ఎంతటి ఆత్మీయుల్ని కోల్పోయినా ఆగకుండా సాగిపోయే నైజం జీవిత గమనంలో ఉంది.

అక్కపోయి రెండేళ్ళ కాలం గడచిపోయింది. బియ్యే డిగ్రీ, టైపు, షార్టుహేండ్ పరీక్షాఫలితాలు చేతుల్లోపట్టుకొని ఉద్యోగాన్వేషణలో నేను తిరుగాడుతున్న సమయంలో అక్క అత్తగారు రాజమ్మ వచ్చింది.

చుట్టపుచూపుగా చూసిపోవడానికికాదు. అత్తయ్యా మామయ్యలతో మంతనాలాడ్డానికి. బావ మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకొంటున్నాట్ట.

"పుట్టింది ఇద్దరు పిల్లలు. పుట్టినా వాడి వయసెంత కాబట్టి. పెళ్లి పెడాకులు లేకుండా మిగిలిన జీవితమంతా ఎలా వెళ్ళమారుతుంది? వంటరి మొగవాడు పిల్లల్ని పెంచి పెద్దచెయ్యడం అంటే మాటలా? అందునా ఆడపిల్లలాయె...నాదేముంది కాటికి కాళ్లు చాచుకొని ఉన్నదాన్ని. ఈరోజు ఇలా ఉంటే రేపు ఎలా ఉంటానో చెప్పేందికి లేదు. ఇంట్లో ఆడదక్షత లేకుండా వాడి సంసారం ఎలా సాగుతుంది?" అంటూ సాధకబాధకాలన్నీ ఏకరువుపెట్టి "జయనిస్తే పిల్లలకి తల్లిలేనిలోటు తీరుతుంది. ఎవరో పరాయింటి పిల్లవస్తే పిల్లల్ని జయ చూసుకొన్నట్లు చూసుకోలేదు కదా?'' అంది ఆవిడ.

మామయ్యా నాకంటెచిన్నవాళ్ళయిన తన కూతుళ్ళు లక్ష్మికి, సీతకి గంతకి తగ్గ బొంత అన్నట్లు ఏవో సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేసేసేరు. కాని నాపెళ్ళి విషయం ఎప్పుడూ మాటవరుసకైనా ఎత్తలేదు. దానికి కారణం లేకపోలేదు. మామయ్య ఉద్యోగ విరమణచేసేరోజులు దగ్గరికి వచ్చేయి. సాంబు, రాముడు చేతికి అందివచ్చేదాకా ఆర్థికంగా వారికి సహాయపడ్తానని ఆశ.. పడాలని కోరిక అయినా రాజమ్మతో ఆమాట చెప్పలేక "మేము అవునూ కాదూ అని నిర్ధారించడానికి జయ చిన్నపిల్లకాదు. దానిబరువు బాధ్యతలు మంచి చెడ్డలు చూసుకొనే వయసు వచ్చింది. దానిని అడిగి చూడండి. అది ఇష్టపడితే మా అభ్యంతరం ఏమీ ఉండదు" అన్నారు.

ఈవిషయం ఏదో తేలిపోతే మరో దగ్గర సంబంధాలేమైనా చూసుకోవచ్చు అని అభిప్రాయంతోఉన్న రాజమ్మ సూటిగా నన్నే అడిగేసింది. కేవలం అడిగి ఊరుకోవడమేకాక తనకి తోచిన రెండుమూడు మాటలు కూడా చెప్పింది. అందులో కొన్ని నా మనసులో లోతుగా దిగబడ్డాయి. అలా జరుగుతుందనితెలిసే ఆవిడ ఆమాటలన్నది. "తల్లి లేకుండా పెరిగిన పిల్లవు. తల్లిలేనిలోటు ఎటువంటిదో నీకు తెలిసేఉంటుంది. ఆనాడు నీకు ఆలోటు కనిపించకుండా మీ అక్క నిలచింది. ఈ నాడు మీ అక్కపిల్లలకి ఆ గతి పట్టింది. వాళ్ళకి ఆలోటు తీరాలంటే నువ్వు వాళ్ళకి తల్లివి కావాలి. ఇంకో ఇంటిపిల్లవస్తే మీ బావకి పెళ్లాం కాగలదేకాని నీఅక్కపిల్లలకి తల్లికాలేదు. ఇంతకన్న నీకేం చెప్పను?'' అంది.

"అత్తయ్యగారూ మీరు చెప్పిన విషయాలన్నీ చాలా సబబుగానే ఉన్నాయి. కాని నన్ను కొంచెం ఆలోచించుకోనీండి" అన్నాను. "అలాగే కానీ అమ్మా! బాగా ఆలోచించుకొన్నాకే నీ అభిప్రాయం ఏమిటో మీ మామయ్యచేత ఒకఉత్తరం ముక్క రాయించి పడేయి"అంది ఆవిడ చివరిమాటగా.

రాజమ్మ వెళ్ళిపోయేక ఆ విషయం గురించి దీర్ఘంగా రెండుమూడు రోజులు ఆలోచించేను. వరుసగా కారణాలుచూసుకుంటూపోతే చాలవరకు బావతో వివాహానికే అనుకూలంగానే వచ్చేయి ఫలితాలు. మొదటిది—రాజమ్మ చెప్పినట్లు బావ పరాయిపిల్లని పెళ్లిచేసుకొంటే ఆమె లోకానికి వెరచి పిల్లల సంరక్షణ భారం వహించగలదేకాని, వారికి తల్లిలేనిలోటు తీర్చలేదు. నాకు అక్కపిల్లలపట్ల ఉండేంత ప్రేమాభిమానాలు ఆ పిల్లకి ఉండాలనుకోడం, ఉంటుందనుకోడం కూడా అవివేకం—ఆత్మవంచనా అవుతుంది. రెండోది బావ స్వతహాగా మనిషి మంచివాడు. అతడిపట్ల నాకు జాలి, సానుభూతి ఉంది. మూడు—ఈ నాటి సంఘంలో ఆడది ఎంత చదువుకొన్నా, ఉద్యోగం చేస్తున్నా ఊళ్లేలుతున్నా వంటరిగా బ్రతకడానికి తగిన వాతావరణం లేదు. నాలుగు — బావనికాదని మామయ్యా, నేను ఇంకో వరుడికోసం వెతుకులాడినా ఇంతకంటె మంచివాడు, స్థితిమంతుడు ఈ కట్నాలయుగంలో దొరుకుతాడనే నమ్మకంలేదు. అయిదు- పెళ్లి పెడాకులు లేకుండా జీవితాంతం కన్యగా ఉండిపోయి మామయ్య సంసారాన్ని బాగుచెయ్యాలనేంత కోరికా, ఆత్మీయతా నాలో చోటుచేసుకోలేదు. కాదంటే మామయ్య నన్నూ అక్కనీ తీసుకువచ్చి మంచో చెడో పెంచి పెద్దచేసేరు కాబట్టి ఆ ఇంట మేము అనుభవించిన సుఖసంతోషాలు, అభిమానాలు ఎలాఉన్నా ఆర్థికంగా ఆ కుటుంబాన్ని కొంతకాలం ఆదుకోవలసిన నైతిక బాధ్యత నాపైఉంది. ఈ వివాహం జరగడంవల్ల దానికి ముప్పువచ్చే అవకాశం లేదు. నా జీతంలో పదో పరకో మామయ్యకి పంపుతానంటే బావ అడ్డుచెప్పే మనిషికాదు. వీటన్నిటినీ మించి బావతో పెళ్ళికి నన్ను ఒప్పించిన విషయం తన పిల్లలకి నేను తల్లినయితే ఆ లోకంలో ఉన్న అక్క ఆత్మ సంతోషిస్తుందనీ ఆవిధంగా అక్కరుణం తీర్చుకొన్నట్లవుతుందని.



నేను ఆ నిర్ణయాని కొచ్చేక మామయ్యచేత ఆ విషయం బావకి తెలియచేస్తూ ఉత్తరం రాయించేను. అదే సమయాన మామయ్యకి తనని ఆర్థికంగా ఆదుకొంటానని హామీకూడా ఇచ్చేను.

బావకి భార్యగా అక్క పిల్లలకి తల్లిగా ఆ ఇంట నా జీవితం ఎటువంటి ఒడుదుడుకులు లేకుండా మూడేళ్లు గడిచిపోయింది. అత్తగారు ఒకనాడు ఆ విషయాన్ని కదపకపోతే ఆ గాడిలో పడి ఇంకెంతకాలం సాగిపోయేదో అటువంటి పరిస్థితి ? "జయా నాదో చిన్నకోరిక ఉందమ్మా. నువ్వు తీరుస్తానంటే చెప్తాను'' అంది ఆవిడ.

పెద్దావిడ. ఇహలోక బంధనాలుసడలి పరలోక విషయంపై దృష్టి కలిగే వయసులో ఉంది.ఏ తీర్థయాత్రలకివెళ్ళి రావాలనో, నోమూ, వ్రతం చెయ్యాలనో ఉండి ఉంటుంది. అటువంటివి ఆవిడ కోరడం మేము జరపడం సహజమే కదా — అనుకొన్నాను. ''అడగండి మీకు నాదగ్గర సంకోచం ఎందుకు?'' అన్నాను.

''నువ్వు ఈ ఇంట్లో కాలుపెట్టేవు. రాజు గురించి పిల్లల గురించి నా బెంగ తీరిపోయింది. ఇంక మిగిలిందల్లా నా దొక్కటే కోరిక. నీ కడుపున ఓకాయ కాస్తే చూసి కళ్ళుముయ్యాలని'' అంది ఆవిడ అభిమానంగా నాతల నిమురుతూ.

బహుశ నేను ఏవో జాగ్రత్తలు పడుతున్నాననీ అందుకే కాపురానికివచ్చి మూడేళ్ళు కావస్తున్నా నెలతప్పడంజరగ లేదనీ ఆవిడ అనుకొని ఉంటుంది. నిజానికి అటువంటి జాగ్రత్తలేం నేను తీసుకో

లేదు. మరెందుకిలా అయింది ? నాలో మథన ప్రారంభమయింది. తల్లిని కావాలనేకోర్కె రెపరెపలాడింది. కాలేక పోవడానికి కారణం ఏమిటో తెలుసుకోవాలనే తొందర మొదలయింది.

అదృష్టవశాత్తు నాతోపి యు సి.కలసి చదివిన శాంత గవర్నమెంటు ఆస్పత్రిలో లేడీ డాక్టరుగా ఇటీవలనే జాయిన్ అయింది. శాంత మొగుడు శ్రీపతికూడా డాక్టరే. అతడు ప్రైవేటుగా ప్రాక్టీసు పెట్టుకొన్నాడు. ఒకసారి శాంతను చూసినట్లు అవుతుంది, ఈ విషయం గురించి తెలుసుకొన్నట్లూ అవుతుందని సాయంకాలం ఆఫీసునుంచి అటువెళ్లేను. మామ్మూలు క్షేమసమాచారాలు మాటలు అయేక నావిషయం చెప్పేను. "దానికేముంది ? ఈసారి వచ్చినప్పుడు మీవార్ని కూడా తీసుకువస్తే... ఇద్దర్నీ పరీక్ష చేసి చూస్తే తేలిపోతుంది" అంది శాంత.

"ఈ విషయంలో ఆయన్ని పరీక్షించటం అనవసరమనుకొంటాను..."

"మనలో చాలామంది పడే తెలివి తక్కువ అదే జయా ! ఒకస్త్రీకి పిల్లలు పుట్టకపోతే వెంటనే ఆమెని గొడ్రాలు అంటూ ఈసడించిపారేస్తారు. నిజానికి ఒక స్త్రీ గర్భవతి కాకపోవడానికి ఆమె ఎంతవరకు కారణం కావచ్చో పురుషుడిది కూడా అంతే."

"అదికాదు శాంతా ! నేను అక్కపోయేక బావని పెళ్ళిచేసుకొన్నాను. అక్కకి ఇద్దరు ఆడపిల్లలు" అన్నాను విషయాన్ని వివరిస్తూ.

"అలాగా," అంటూ కాస్సేపు ఆలోచనలో పడింది శాంత. అంతలో ఏదో మనసుకి తోచినట్లు సర్దుకొని, "అయినా మీ శ్రీవారిని కూడా పరీక్ష చెయ్యాలనుకొంటాను జయా ! కారణం మీ అక్కని మీ బావ ఎంతగా ప్రేమించేవాడో, ఆరాధించేవాడో మనకి తెలుసు. నీకు పిల్లలుపుడితే ఆ పిల్లల్ని అభిమానంతో చూడవని వేసక్టమీ ఆపరేషన్ చేయించుకొని ఉండొచ్చు..."

శాంత ఆమాట అన్నాక నేను తల్లిని కాకుండా ఇలా మిగిలిపోడానికి బహుశ ఆదేకారణం కావచ్చు అన్న అనుమానం నా మనసులో ప్రవేశించింది. ఆ విషయాన్ని చెప్పక బావ అనవసరంగా నన్ను మోసం చేసేడు అన్నకోపం లోపల దహిస్తుంటే... అతడి చర్యని బట్టబైలు చెయ్యాలనే తలంపుతో పట్టుపట్టి డాక్టరు దగ్గరికి తీసుకుపోయేను.

మరునాడు కాస్త ముందుగా ఆఫీసులో పని తెమిలిపోయింది ఒకసారి శాంతను చూసిరావాలనీ ముందురోజు చేసిన టెష్టుల ఫలితాలెలా ఉన్నాయో కనుక్కోవాలనీ అటు వెళ్ళేను. "రా జయా !" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించింది శాంత.

"నిన్నటిటెష్టులఫలితాలు వచ్చేయా" అని అడిగేను కుర్చీలో కూర్చుంటూ.

"ఇదిగో ఇప్పుడే వచ్చేయి. అవే చూస్తున్నాను" అంది శాంత. మరో పది నిముషాలు పోయేక "నీ రిపోర్టుఅంతా సరిగ్గా ఉంది జయా. నీలో ఏమీ లోపం లేదు మీ బావకూడా నేను అనుమానించినట్లు ఆపరేషన్ ఏమీ చేయించుకోలేదు. నిజానికి ఈ రిపోర్టులో ఉన్నంతవరకు అటువంటి అవసరమేలేదు. ప్రస్తుతం అతడి శరీరస్థితి ఉన్నపద్ధతిలో అతడి వల్ల ఏస్త్రీ గర్భవతికాలేదు. కాని అంత మాత్రాన కంగారు పడేందికి లేదు. ఇటువంటివి ఎన్నో కేసులు ఆపరేషన్‌వల్ల బాగుపడ్డం ఉంది. మీఆయనకి కాస్త వీలున్నప్పుడు వచ్చి శ్రీపతిని కలుస్తే మరోసారి పరీక్షచేసి ఏం చెయ్యాలో చెప్తాడు. అంతా సరిగా జరిగిపోతే వచ్చే ఏడాదికి నువ్వు బిడ్డతల్లి అవుతావు- అందులో సందేహం లేదు. నువ్వేం కంగారుపడకు"—అంటూ శాంత ఇంకా ఏమేమో నన్ను ఉత్సాహపరచడానికి చెప్తున్నది. కాని అందులో ఒక్కమాట కూడా నా చెవుల్లో దూరలేదు. మనిషిని కొయ్యబారిపోయి మతిపోయినదానిలా శాంతవైపు చూస్తూ అలా ఉండిపోయేను. ఆ స్థితిలో కొంతసేపు కొట్టుమిట్టాడేక మెల్లగా కోలుకొని, ఆందోళనని అదుపులో పెట్టుకొని నెమ్మదిగా లేచి వెళ్ళి శాంత రెండు చేతులూ పట్టుకొన్నాను.

అంతవరకు తన ధోరణిలో తాను ఉన్న శాంత నా పరిస్థితి గమనించలేదు. ఆ విధంగా ముందు నిల్చిన నన్నుచూసి కంగారుపడ్తూ "ఏమిటి జయా ! ఏమయింది ?" అంది ఆత్రంగా.

"నువ్వు నా చిన్ననాటి స్నేహితురాలివి శాంతా ! నిన్నొకటి కోరుతున్నాను. కాదని నిరాకరించకు" అన్నాను ప్రాధేయపడ్తూ.

"చెప్పు జయా, నా దగ్గర నీకు సంకోచం ఏమిటి? ఏం చెయ్యమంటావో చెప్పు" అంది శాంత ఆప్యాయంగా నా చెయ్యి వొత్తుతూ.

"ఈ విషయం బైట పడనీకు. ఎప్పుడూ... ఎవరిదగ్గరాకూడా, రేపో, ఎల్లుండో బావ రావచ్చు. లోపం నాలోనే ఉందనీ ఆపరేషన్ చేస్తే సర్దుబాటు కావచ్చనీ, అదైనా నికరంగా చెప్పింది కాదనీ చెప్పు. ఇది నా కోరికగా మీ శ్రీవారితో కూడా చెప్పి బావతో ఆ విధంగానే చెప్పమను..."

"ఇదంతా దేనికి జయా !"

"నువ్వు డాక్టరువి శాంతా ! వైద్య శాస్త్రానికి సంబంధించిన విషయాలతో నీబుర్ర నిండిపోయి ఉంటుంది. అందులో ఇతరవిషయాలు అట్టేకాలం నిలిచేందుకు చోటు ఉండదు. అందుకే నేను మొన్న చెప్పినమాట మరచిపోయేవు. అక్కకి ఇద్దరు పిల్లలు శాంతా ! బావ వారికి తండ్రి కావడానికి అవకాశమేలేదు అంటున్నావు. ఈ విషయం బావకి తెలిస్తే అతడి దృష్టిలో అక్క కులటగా నిలిచి



పోతుంది. అక్కని అంతగా ప్రేమించిన బావ నిప్పులాంటి ఈ నిజాన్ని భరించ లేక పిచ్చివాడు కావచ్చు. ఏ పాపమూ ఎరగని ఆడపిల్లల జీ వి తా లు దీని మూలంగా నాశనం అయిపోతాయి. తల్లిని కావాలనే నా స్వార్థంతో ఒక నిండు కుటుంబాన్ని నాశనంచెయ్యలేను శాంతా! చచ్చి ఏ లోకంలోనోఉన్న అక్కకోసం తన పిల్లల మంచికోసం నా మాతృత్వ వాంఛనేకాదు జీవితాన్ని పణంగా పెట్ట మన్నా పెడ్తాను. శాంతా! దయవుంచి ఈ విషయం గో ప్యం గా ఉంచండి. ఎక్కడా బైట పెట్టకండి" అన్నాను ఆవేశంగా.

"నీ ఇష్టం జయా! కాని రేపటిలోగా నీ మనసు మార్చుకొంటే ఆ సంగతి మాత్రం నాకు తెలియజెయ్యి – నీ దొక మాట మా దొకమాట అయితే బాగుం డదు. డాక్టరుగా ఇది చెయ్యకూడని పని అయినా నీకోసం చేయడానికి సిద్ధపడ్డు న్నాను." అంది శాంత.

నా అభిప్రాయం మార్చుకొన్నట్లు శాంతతోచెప్పవలసినఅవసరం నాకులేదు. కారణం బాగా ఆలోచించే ఆ నిర్ణయానికి వచ్చేను కాబట్టి. మరి రెండురోజులనాడు కాస్త ఆలస్యంగా ఇంటికి వచ్చేడు బావ. "డాక్టరు దగ్గరికి వెళ్ళేను. అందుకే కొంచెం ఆలస్యం అయింది" అన్నాడు కాళ్ళు, చేతులు కడుక్కొంటూ. అత్త గారు కోవెలకి వెళ్ళేరు. పిల్లలు పొరు గింట్లో ఆడుకొంటున్నారు. కొంచెంసేపు ఇంకేమైనా చెప్తాడేమోని అక్కడే నిలచి

అతడు ఆ విషయం తిరిగి ప్రస్తావించక పోడంతో కాఫీ తేవడానికి లో ప లి కి వెళ్ళేను.

నా చేతిలో కాఫీకప్పు అందుకొంటూ "నీ రిపోర్టు పెర్‌ఫెక్టుగా ఉంది జయా! ఆ లోపం ఏదో నా లో నే ఉందిట" అన్నాడు ఏదో అతి సామాన్యవిషయం చెప్తున్న ధోరణిలో. కాఫీకప్పు అంది స్తున్న నాచేయి వణికింది. గుండెగడగడ కొట్టుకొంది. ఒక్కసారిగా నోట తడి ఇగిరిపోయి మాటరావడం కష్టంఅయింది. పక్కగాఉన్న టేబిల్ని ఆనుకొని పడిపో కుండా నన్ను నేను నిలవరించుకొన్నాను. అతిప్రయత్నంమీద గొంతుక పెగుల్చు కొని, "అలా అని ఎవరు చెప్పేరు?" అన్నాను నెమ్మదిగా.

"ఇంకెవరు చెప్తారు? శ్రీపతి, శాంతా. నువ్వు ఈ విషయం నాతో చెప్పవద్దని మాటతీసుకొన్నసంగతికూడా చెప్పేరు."

అప్రయత్నంగా నా పిడికిలి బిగిసి పోయింది. శాంతమీద చెప్పలేనంతకోపం పొంగుకొచ్చింది. 'స్నే హి తు రా ల ను కొన్నాను – ఇంత నమ్మకద్రోహం చేస్తుందనుకోలేదు' మనసులో అనుకో బోయిన మాట కోపంవల్ల బైటికి తన్ను కొచ్చింది.

"ఇందులో వాళ్ళ తప్పేంలేదుజయా! ఈవిషయం నాకింతకుపూర్వమే తెలుసని గ్రహించేకే వివరంగా చెప్పేరు."

"అంటే?"

"అవును జయా? ఈ ని ప్పు ని మూడేళ్ళుగా నా క డు పు లో దాచు కొన్నాను. ఆ మంటతో మానసికంగా మాడినుసి అయిపోయేను. ఇప్పుడు నాతోపాటు ఈ బాధని పంచుకోడానికి నువ్వు సిద్ధపడ్డావు. నా ఆరాటం కొంత చల్లారవచ్చు – నేను తిరిగి మనిషిని కావచ్చు. చచ్చి ఏ లోకంలోనో ఉన్న మీ అక్క పరువు కాపాడ్డానికి ఇంతకు




పూర్వం నేను ఒక్కడినే. ఇప్పుడు నువ్వు కూడా తోడయేవు.

"మీఅక్కని నేనెంతగా ప్రేమించేనో, ఆరాధించేనో నీకు తెలియందికాదు. అటువంటి భార్యపోయిన రెండేళ్ళుతిరక్కుండానే పెళ్ళికి సిద్ధపడ్డంతో నీ దృష్టిలో నేను దిగజారి ఉండవచ్చు - 'మగవాళ్ళంతా ఇంతే. ఎదుట ఉన్నంతసేపు ప్రేమ ప్రేమ అని అంగలారుస్తారు - కనుచాటు కాగానే మళ్ళా వేటకి బైలుదేరుతారు' అని అనుకొని ఉండవచ్చు. కాని నేను నిన్ను పెళ్ళి చేసుకోవాలనుకోడం నాకోసం కాదు. మీ అక్కకోసం - తన పిల్లల కోసం. చచ్చిపోతూ 'పిల్లలు జాగ్రత్త' అని అప్పగించి పోయింది మీ అక్క. పిల్లలకి ఏలోటు రాకుండా పెంచి పెద్ద చేస్తానని చేతిలో చెయ్యివేసి మాట ఇచ్చేను. మీ అక్కంటే నీకెంత అభిమానమో ప్రేమో నాకు తెలుసు, ఆ చేతిలో పెరిగితే పిల్లల జీవితాలు చల్లగా సాగిపోతాయనుకొన్నాను. వాళ్ళకి తల్లిలేని లోటు నువ్వు తీర్చగలవనుకొన్నాను.

"నామీద సానుభూతివల్లనో, అక్కపిల్లలపట్ల జాలివేతో, నువ్వు ఈ పెళ్ళికి ఒప్పుకొన్నావు. కాని నిన్ను నేను పెళ్ళాడింది ఒక కార్యార్థం. అది పూర్తిగా నెరవేరాలంటే నీకు పిల్లలుకలుగకూడదు. ఇది నా స్వార్థమే. కాదనను. అసలు నిన్ను పెళ్ళి చేసుకొన్నదే స్వార్థంతో. నీకు తెలియకుండా ఆపరేషన్ చేయించుకోవాలనే నిర్ణయానికి వచ్చేను. నువ్వు ఊళ్ళోలేని సమయంచూసి డాక్టరు దగ్గరికి వెళ్ళేను. అక్కడే మొదటిసారిగా విన్నాను చాకులాంటి ఈ మాటని. అది బలంగా నా గుండెల్లోకి దిగిపోయి కొంత కాలం చిత్రవధ చేసింది. నీ దృష్టిలో మీ అక్కని హీనపర్చలేక ఇంతకాలం ఈ కఠోరసత్యాన్ని నాలో స్థాపితం చేసేను. మొన్న నువ్వు అంత పట్టుపట్టి నన్ను లాక్కువెళ్ళకపోతే ఇది ఎప్పటికీ నీకు తెలిసేదికాదు. నాలో అణగిఉండి నాతోనే కాలి బూడిదఅయేది ఈవిషయం.

"ఇప్పుడీ తెర తొలగిపోయింది. ఒక విధంగా ఇది మంచికే జరిగింది. మీ అక్కకిచ్చిన మాటప్రకారం తన పిల్లలికి ఎటువంటి లోటూ రాకుండా పెంచి పెద్ద చెయ్యడం ఖాయం. అందులో ఎటువంటి పొరపాటు రానివ్వను, కాని, నేనూ మనిషినే అవకాశం ఉంటే నా రక్తం పంచుకు పుట్టిన పిల్లలచేతే 'నాన్నా' అని పిలిపించుకోవాలనే కోరిక కలగడంలో విపరీతం లేదు. ఈ కోర్కె ఎంతో న్యాయమైనది - సహజమైనది అని నేను భావించేను. అందువల్లనే ఆపరేషన్‌కి రోజు నిర్ణయించుకుని, వారితో చెప్పి వచ్చేను..."

బావ అలా చెప్పుకుపోతుంటే చలనం లేక బొమ్మలా అలా వింటూ ఉండిపోయేను. అటువంటి వ్యక్తిని భర్తగా పొందినందుకు నా మనసు గర్వంతో పొంగిపోయింది. ఆనందంలో తేలిపోయింది.

ఆటలకి పోయిన పిల్లలు వచ్చేరు. తండ్రిని చూస్తూనే "నాన్నా నాన్నా" అంటూ గోలగా ఏదో చెప్పసాగేరు. వారిని బుజ్జగించి వొడిలో కూర్చుండపెట్టుకొని, వారితో కబుర్లుచెప్తున్న బావని చూస్తుంటే ఇంతమంచి మనిషిని అక్క ఎందుకు మోసం చేసింది_అన్నప్రశ్న నాలో చెలరేగింది. అది ఏనాటికీ ప్రశ్నగా నిలిచిపోవలసిందేకాని జవాబు పొందే మార్గం లేదుకదా ?